క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల నరికివేత, మరమ్మతుల కారణంగా మండలంలోని రావల్‌కోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. ఇందులో భాగంగా రావల్‌కోల్ గ్రామం, గ్రామ పరిధిలోని పరిశ్రమలకు, అగ్రికల్చర్ ఫీడర్‌కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలో...

చెట్ల నరికివేత కారణంగా మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని మేడ్చల్ చెక్ పోస్ట్‌లో గల పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు సోమవారం ఉ.10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు.

భాషా పండితులపై చర్యల ఖండన

మేడ్చల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న భాషా పండితులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్టీఎస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేంకుమార్, వెంకటేశ్వర్లు ఖండించారు. చాలా పాఠశాలలో తెలుగు, హిందీ పండిట్ పోస్టులు మత్రామే ఉన్నాయని, జాబ్ చాట్ ప్రకారం వారు 6 నుంచి 8వ తరగతులకు బోధన చేయాల్సి ఉండగా చాలా పాఠశాలలో పదో తరగతి వరకు బోధన చేస్తున్నారన్నారు. ఒకే భాష సబ్జెక్ట్‌ను స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండిట్లు బోధిస్తున్నారన్నారు. పండిట్లు తక్కువ జీతం తీసుకుంటూ ఎక్కువ కష్ట పడుతున్నారని, దీంతో వారికి అన్యాయం జరుగుతుందన్నారు. భాషా పండిట్‌లకు పదోన్నతులు కలిపిస్తామని సీఎం హామీ ఇచ్చినా అమలు చేయకపోవడంతో పండిట్‌లు 9, 10 తరగతులకు బోధన చేయమని చెబితే కొన్ని జిల్లాల్లో అది సాకుగా చూపుతూ అధికారులు క్రమ శిక్షణ చర్యల పేరుతో సస్పెండ్ చేయడం సబబు కాదన్నారు. పండిట్‌లపై చర్యలు మాని వారికి పదోన్నతులు కలిపించాలని డిమాండ్ చేశారు.

చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నాటకంలో కళాకారులు

మేడ్చల్‌రూరల్: చిందు కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మండల ఎమ్మార్పీఎస్ యువసేన ప్రధాన కార్యదర్శి భానుచందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 5వ వార్డులో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కళాకారులు మచేందర్ బృందం సద్ది తులసి నాటకాన్ని ప్రదర్శించారు. తమ నాటకంతో ఆకట్టుకున్న కళాకారులకు రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల

ఘట్‌కేసర్: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమంలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ మండల బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సురేష్ గైక్వాడ్, దీప్ గైక్వాడ్, పరుశురాం, దాస్, శ్రీనివాస్, రాందాస్, శ్రీనివాస్, నారాయణ, నర్సింహ, బాలయ్య, మధుకర్, నవీన్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌కు అఖండ జ్యోతి రథం



స్వామిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య దంపతులు, వైస్ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహ్మా స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బర్కత్‌పూరా యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి బయల్దేరిన శ్రీలక్ష్మినరసింహ స్వామి అఖండ జ్యోతి రథం ఆదివారం రాత్రి ఘట్‌కేసర్‌కు చేరుకున్న సందర్భంగా భక్తులు స్వామి వారికి ఘన స్వాగతం పలికి దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో మున్సిపాల్ చైర్‌పర్సన్ దంపతులు పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గండేశ్వర్‌రావు, చంద్రశేఖర్, రమేశ్, గాంధీ, శేఖర్‌గుప్తా, లక్ష్మారెడ్డి, సత్తిరెడ్డి, కౌన్సిలర్లు మల్లేశ్, పద్మారావు ఉన్నారు.

గురుస్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల రోజులు దీక్ష చేసిన మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి చెందిన శివ స్వాములు ఆదివారం ఉదయం ఇరుముడి కట్టుకుని శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయల్దేరుతున్న దృశ్యం.– మేడ్చల్‌రూరల్





ఐటీ పార్క్ కోసం కేటాయించిన స్థలంలో హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు



ఏడాది క్రితం ఐటీ పార్క్ కోసం భూమి పూజ చేస్తున్న మంత్రి కేటీఆర్

టవర్స్.. ట్రబుల్స్!

హడావుడిగా ప్రారంభించి అంతలోనే మరిచిన ఐటీ టవర్స్ నిర్మాణం

- శంకుస్థాపనకే పరిమితమైన మేడ్చల్ గేట్ వే ఐటీ పార్క్
- ఏడాది పూర్తయినా నిర్మాణానికి పడని అడుగులు
- సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా చేపట్టిన కార్యానికి హైటెన్షన్ లైనే కారణమా?
- ముందుకు సాగని పనులతో ముక్కున వేలేసుకుంటున్న స్థానిక జనం

మేడ్చల్: ఉత్తర తెలంగాణ ముఖద్వారంలో ఐటీ పార్క్ అంటూ ఏడాది క్రితం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శంకుస్థాపన చేసిన మేడ్చల్ గేట్ వే ఐటీ పార్క్ అడుగు ముందుకు వేయలేదు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గతేడాది ఈ ఐటీ పార్క్‌కు స్వయాన మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు టవర్ నిర్మాణానికి ఇటుక కూడా పడలేదు. ఐటీ పార్క్ ఏర్పాటుతో మేడ్చల్ రూపురేఖలే మారుతాయని ఈ ప్రాంత ప్రజలు భావించినా నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో తమ కల సాకారం అయ్యేదెన్నడో అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆరు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో మార్కెట్ కమిటీ యార్డు స్థలంలో 2022 ఫిబ్రవరి 17వ తేదీన ఐటీ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేసి గేట్‌వే ఐటీ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఆరు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ టవర్స్ నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే ఐటీ పరిమితం కాకుండా ఉత్తరాణ ఉన్న మేడ్చల్ ఐటీ అభివృద్ధికి గేట్ వే ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు నాటి సభలో మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఐటీ కంపెనీలో ముందుకు వచ్చాయని, త్వరితగతిన టవర్స్ పూర్తి చేస్తామన్నారు. ఐటీతో మేడ్చల్ రూపురేఖలే మారిపోతాయని నాటి సభలో మంత్రి మల్లారెడ్డి కూడా చాలా ఉత్సాహంగా చెప్పారు.

అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో చలనం కరువు...

ఐటీ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి సంవత్సరం గడుస్తున్నా నిర్మాణం కోసం అడుగు పడలేదు. సభా నిర్వహణకు నాడు చదును చేసిన ప్రాంతం ఎలా ఉందో ప్రస్తుతం అలాగే ఉంది. భూమి పూజ కార్యక్రమం పూర్తి చేసిన నాటి నుంచి అక్కడికి ఏ అధికారి గానీ, నాయకుడు గానీ కన్నెత్తి చూ డలేదు. చెట్లు, ఇతర నిర్మాణాలను కూల్చి వేసి ఐటీ పార్క్ కోసం అంటూ హడావుడి చేసిన అధికారుల్లో, నేతల్లో ప్రస్తుతం ఎలాంటి చలనం కనబడం లేదు.

- భూమి పూజ చేసి ఏడాది అయినా టవర్స్ ఏర్పాటుకు ఇటుక కూడా అక్కడికి రాలేదు. ఐటీ టవర్స్ పేరుపై మాత్రం రియల్ వ్యాపారులు జోరుగా భూ దందా చేస్తున్నారు. భూముల రేట్లు పెంచి కోట్ల రూపాయలు మాత్రం సంపాదిస్తున్నారు.

ఆగమైన మార్కెట్ కమిటీ, గోదాములు..

ఐటీ టవర్స్ నిర్మాణం ఏమో గానీ మార్కెట్ కమిటీ, గోదాములను కూల్చి వేయడం, మార్కెట్ కమిటీ కార్యాలయం ఖాళీ చేయడంతో మేడ్చల్ మార్కెట్ ఆగమైంది. మార్కెట్ కమిటీ కార్యాలయ భవనంను కండ్లకోయ వార్డు ఆఫీసు పై అంతస్తులో ఏర్పాటు చేశారు. పాలకవర్గం కూర్చునేందుకు ఇరుకైన భవనంలో కొద్ది మేర సదుపాయాలు కల్పించి అతిపెద్ద మార్కెట్ కమిటీ కార్యాలయంను ఓ చిన్న గదిలోకి మార్చారు. నాటి మంత్రి దేవేందర్‌గౌడ్ పట్టుదలతో పని చేసి కార్యాలయం లేని మార్కెట్ కమిటీకి కార్యాలయానికి అందమైన భవనం నిర్మాణం చేయించారు. ఆ తర్వాత గోదాములు, కల్లాలు ఏర్పాటయ్యాయి. సీజన్‌లో రైతులు తమ ధాన్యంను ఇక్కడే అమ్ముకునే వారు. కొంతమంది గోదాముల్లో నిల్వ చేసే వారు. పౌర సరఫరాల గోదాము ఇక్కడే ఉండేది. ఇప్పుడు గేట్ వే పార్క్ కోసం అన్ని కూల్చి వేసినా ఫలితం మాత్రం కనబడటం లేదు.

హైటెన్షన్ లైన్లు అడ్డమా..?

ఐటీ పార్క్ ఏర్పాటు కోసం శంకుస్థాపన చేసిన స్థలం మీదుగా భారీ, మధ్య తరహా హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు వెళ్తున్నాయి. ఐటీ టవర్స్ అంటే పదుల సంఖ్యలో అంతస్తుల భవనాలు ఉంటాయి. హై టెన్షన్ స్తంభాలను మార్చడం అసాధ్యం కాకపోయిన కష్టతరం కావడంతో కండ్లకోయ ఐటీ పార్క్ నిర్మాణంలో ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా మంత్రి కేటీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేడ్చల్ గేట్ వే ఐటీ పార్క్‌కు మాత్రం ఎలాంటి పునాదులు పడకపోవడంతో ఇది ఆరంభ శూరత్వంగానే మిగిలిపోయింది.

వైభవంగా రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

కనుల పండువగా నాల్గో రోజు బ్రహ్మోత్సవాలు



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో నాల్గో రోజైన ఆదివారం ఆ మహాశివుడికి వేదపండితులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజను వైభవంగా నిర్వహిచారు. అదేవిధంగా టీటీడీ వేద పాఠశాల పండితులు యాగశాలలో రుద్రస్వాహాకార హోమం చేయగా ఇక సాముహిక అభిషేకాల్లో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పము తదితర పూజలను చేశారు. ఇక రాత్రి 8 గంటల తరువాత కొండ దిగువన గల పార్క్ సమీపంలో స్వామివారికి విమాన రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్లతామర కొలను వరకు కొనసాగిన రథోత్సవం కొనసాగింది. కాగా ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. స్వామి దర్శనానంతరం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో గల శివలింగాలకు అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి అర్ధరాత్రి లింగోద్భవకాలంలో గర్భగుడిలో స్వామివారికి వేద పండితులు వైభవంగా సంతతధారాభిషేకం నిర్వహించారు.

నేటి పూజా కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం) ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, సాముహిక అభిషేకములు, ఉదయం 8 గంటలకు తైలాభిషేకం, అన్నాభిషేకం, రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పము, 8 గంటలకు వసంతోత్సవము, పుష్పయాగము తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఉపవాస దీక్షల అనంతరం...

ఉపవాస దీక్ష విమరించిన భక్తులకు రెడ్డి సంక్షేమ సంఘం, మార్వాడి మిత్రమండలి, వంశరాజ్ సంక్షేమం సంఘం, జయభారత్ ఇండస్ట్రీస్, ఆర్యవైశ్య అన్నదాన సత్రం, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, ఆర్యవైశ్య అన్నదాన సత్రం సభ్యులు చింత బాలయ్య, రమేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, తిరుమలేష్, రెడ్డి సంక్షేమ సంఘం నేతలు రామిడి ప్రభాకర్ రెడ్డి, నల్ల మధుసుధన్‌రెడ్డి, రామిడి విజయ్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి తదితరులుపాల్గొన్నారు.



శివలింగాలకు అభిషేకాలు చేస్తూ..



మున్నూరుకాపు సంఘం అన్నదాన కార్యక్రమంలో నాగారం చైర్మన్ చంద్రారెడ్డి



యాగశాలలో రుద్రస్వాహాకార హోమం



కీసరగుట్టలో భక్తుల రద్దీ

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం



ఘనాపూర్ మల్లికార్జునుడి కల్యాణంలో హరివర్ధన్‌రెడ్డి



ఎదులాబాద్‌లో అగ్నిగుండం దాటుతున్న భక్తులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఘనాపూర్ గ్రామ పరిధిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది శివరాత్రి మరుసటి రోజు జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరలో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారి ఎదురుకోలు, గణపతిపూజ, పుణ్యావచనము, దత్తాత్రేయ స్వామి అభిషేకం, అనంతరం స్వామి వార్ల కల్యాణం, అన్నదానం, సాయంత్రం అగ్నిగుండాలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎల్లంపేట్ గ్రామంలో...

ఎల్లంపేట్ గ్రామంలోని శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం, ఊరేగింపు కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేట్‌లో.. సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు

ఎదులాబాద్‌లో...

ఘట్‌కేసర్: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఎదులాబాద్‌లోని శ్రీమల్లికార్జున భ్రమరాంబిక ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అగ్నిగుండం ఏర్పాటు చేయగా భక్తులు తమ కోరికలు తీర్చాలని స్వామిని వేడుకుంటూ అగ్నిగుండం దాటారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గూడెం ఆంజనేయులు ముదిరాజ్, చెన్నప్ప, ఓంప్రకాశ్ భక్తులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, బీజేపీల పాలన అంతమైతేనే దేశం, రాష్ట్రం సుభిక్షం'

మేడ్చల్: రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీల పాలనలు అతంమైతేనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటాయని పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కాంగ్రెస్ ముద్రించిన కరపత్రాలను అందజేసి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరావు, శ్రీశైలం, పోచయ్య, రమణారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేష్, సర్పంచ్ సురేందర్, ఉపసర్పంచ్ సత్యనారాయణ, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డబీల్‌పూర్ చింతపండు శుభ్రం చేస్తున్న వారితో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

తీర్మానం చేసిన పనులు కావడం లేదని ఫిర్యాదు

ఘట్‌కేసర్: కొర్రెముల్ పంచాయతీలో పాలకవర్గం తీర్మానం చేసిన అభివృద్ధి పనులు కావడం లేదని గ్రా మానికి చెందిన పలువురు పాలకవర్గ సభ్యులు మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి తమ సమస్యలు విన్నవించారు. సమస్యలు పరిష్కరించాలని అడిగిన వార్డు సభ్యులపై సర్పంచ్ దురుసుగా వ్యవహరిస్తున్నారని, ఇకపై సమష్టిగా ఉద్యమిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆంజనేయులు, దుర్గరాజ్, భాస్కర్, బాబు, స్వామి, నాయకులు యాదగిరి, నాగేశ్, రవికుమార్, మన్నెం ఉన్నారు.



సమస్యల పరిష్కారానికి మంత్రిని కలిసిన కొర్రెముల్ వార్డు సభ్యులు

చెట్ల నరికివేతపై ఫిర్యాదు





మేడ్చల్: అత్వెల్లి శివాలయంలో వెళ్లే రోడ్డులో చెట్ల నరికివేతపై గ్రామానికి చెందిన వారు 1వ వార్డు కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేశారు. గుడి పేరుతో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయని, వాటిని లైటింగ్ పేరుతో పూర్తిగా నరికి వేశారన్నారు. కొంతమంది నాయకులు తమ స్వార్థం కోసం చెట్లు నరికివేయించారని, చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేందాస్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పావలా వడ్డీ రాయితీ హుళక్కేనా..?

- నగర శివారు జిల్లాల్లో పేరుకుపోయిన వడ్డీ రాయితీ రూ.51.78 కోట్ల పైమాటే
- నాలుగేళ్లుగా విడుదల చేయని ప్రభుత్వం
- ఇబ్బందుల్లో స్వయం సహాయక మహిళా సంఘాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం గ్రామాల్లోని మహిళా సంఘాలకు భారీ మొత్తంలో రుణ సహాయాన్ని అందిస్తూ ప్రోత్సహిస్తోంది. బ్యాంకుల నుంచి రుణ సదుపాయాన్ని అందుకున్న ఎందరో మహిళలు తమ స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. సొంతగా యూనిట్లను స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కిరాణ దుకాణాలు, పిండి గిర్నీలు, హోటళ్లు తదితర వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వాయిదా రూపంలో సకాలంలో చెల్లిస్తూ వ్యాపారంలో వచ్చే ఆదాయాన్ని పొదుపు చేసుకుంటున్నారు. అయితే పావలా వడ్డీ డబ్బులను తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయడం లేదు. వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రతి నెలా వడ్డీలు కడుతూ నష్టపోతున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో వడ్డీ రాయితీ బకాయిలు రూ.51.78 కోట్లు పేరుకు పోయాయి. మహిళా సంఘాల సభ్యులు నాలుగేళ్లుగా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 36 మండలాల్లో 875 గ్రామైక్య సంఘాలు ఉండగా, 24,305 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 2,61,148 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 118 గ్రామ సమైక్య సంఘాలు ఉండగా, ఇందులో 3,373 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 36,128 మంది సభ్యులు ఉన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మంజూరు చేసేది. రుణాలు పొందిన వారికి కొద్ది నెలల్లో వడ్డీ డబ్బులను తిరిగి సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 వరకు వడ్డీ విడుదలను నిలిపివేసింది. ఈ నాలుగేళ్లలో పావలా వడ్డీ రూ.51.78 కోట్లు మహిళా సంఘాలకు రావాల్సి ఉంది. వడ్డీని సర్కారు విడుదల చేయకపోవడంతో ఆర్థిక ప్రోత్సాహం కరువై మహిళలు స్వయం ఉపాధి సాధనలో వెనకబడిపోతున్నారు. దీంతో చాలా మంది మహిళలు ఆయా యూనిట్లను స్థాపించడానికి ఆసక్తి చూపించలేక పోతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది

రుణాలపై వడ్డీ రాయితీ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. అందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ అవుతాయి. మహిళా సంఘాలు ప్రతి నెలా బ్యాంకుల్లో వడ్డీ చెల్లింపులను బట్టి ఎంత మేరకు నిధులు కావాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. మహిళలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పద్మజారాణి, డీఆర్డీఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా



శివాజీ జయంతి వేడుకలు

ఛత్రపతి శివాజీ జయంతిని మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, హిందూధార్మిక సంస్థలు, ప్రజా సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో శివాజీ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి అనంతరం పలు నినాదాలతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించారు. హిందు సమాజం కోసం శివాజీ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.

– మేడ్చల్ జోన్ బృందం



మేడ్చల్: గిర్మాపూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన బీజేపీ నాయకులు



మేడ్చల్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రక్తదానం చేస్తున్న యువత



ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తా వద్ద.. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శశీకాంత్‌రెడ్డి, వీరేశం, వేణు, విష్ణు తదితరులు.



కీసర: నాగారంలో శివాజీ విగ్రహం వద్ద జరిగిన వేడుకలో బీఆర్ఎస్ నేతలు గూడరు అంజన్న, చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్, తదితరులు.



మేడ్చల్: గౌడవెల్లి చౌరస్తాలో.. సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ తదితరులు



మేడ్చల్‌రూరల్: మునీరాబాద్‌లో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తదితరులు



జవహర్‌నగర్: ఛత్రపతి శివాజీ సైన్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌యాదవ్, సైన్యం సభ్యులు శ్రీకాంత్, కార్తీక్, వినయ్, శంకర్, శ్రావణ్, తదితరులు.